

28న బీసీ కమిషన్ చైర్మన్ పర్యటన

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న బీసీ కమిషన్ బృందం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనుంది. కమిషన్ చైర్మన్ నిరంజన్ హైదరాబాద్ నుంచి ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన జూమ్ సమావేశంలో వెల్లడించినట్టు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి డి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ హాజరు కానున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన అభిప్రాయ సేకరణ చేయనుంది. 28న మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు నిర్మల్ జిల్లా ఆదిలాబాద్‌కు చెందిన రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేయవచ్చునని తెలిపారు.



ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్యాకేజీనంబర్ 27 పథకాన్ని ప్రారంభిస్తున్న అప్పటి మంత్రి కేటీఆర్ (ఫైల్)



పనులు పూర్తికాకుండానే పథకాన్ని ఎలా ప్రారంభిస్తారని అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ నేత శ్రీహరిరావును అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)

కొనసా..గుతున్న కాళేశ్వరం

(27,28వ ప్యాకేజీ కాలువలు)

నిర్మల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల క్రితం నిర్మల్ జిల్లాలో చేపట్టిన కాలేశ్వరం హైలెవల్ కాలువల పనులు ఇప్పటికీ పూర్తి కాకపోతుండడంతో ఈ కాలువలపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కాలేశ్వరం హైలెవల్ ప్యాకేజీ నంబర్ 27, 28 కాలువల ద్వారా నిర్మల్ నియోజకవర్గానికి 50వేలు, ముథోల్ నియోజకవర్గానికి 50వేలు మొత్తం కలిపి లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2009 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మొదట్లో ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఈ కాలువలను ఆ తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోకి మార్చింది. నిర్మల్ నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని, ముథోల్ నియోజకవర్గంలో మరో 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని వినియోగించుకోవాలని వీటిని డిజైన్ చేశారు. అయితే నిర్మల్ నియోజకవర్గానికి నీరందించాల్సిన 27 నంబర్ ప్యాకేజీ కాలువ నిర్మాణం కోసం రూ.714 కోట్లను, 28 నంబర్ ప్యాకేజీ హైలెవల్ కాలువ నిర్మాణం కోసం రూ. 486.67 కోట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే భూసేకరణ ప్రక్రియ మొదలైన నాటి నుంచే ఈ కాలువల నిర్మాణ పనులకు ఆటంకాలు ఎదురయ్యాయి. భూసేకరణకు మొదట రైతులు నిరాకరించడం, పరిహారం డబ్బుల విషయంలో అంగీకారం కుదరకపోవడం లాంటి సమస్యలు ఈ కాలువల నిర్మాణాల పనులపై ప్రభావం చూపాయి. అయితే అప్పట్లో పనులు చేపట్టిన ఓ పేరెన్నికగన్న కాంట్రాక్టు సంస్థ ముందుకు వచ్చింది. పనులు సైతం ప్రారంభించింది. అయితే ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయకుండా చేతులెత్తేశారు. ఆ తరువాత మరో గుత్తేదారుకు పనులను అప్పగించారు. ఆయనకు కూడా నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్న కారణంగా పనులు చేపట్టలేమని స్పష్టం చేశారు. దీంతో చాలా చోట్ల నిర్మించిన కాలువ పనులన్నీ సరియైన నాణ్యత లేక వరద ధాటికి కొట్టుకుపోయాయి. కొన్ని హైలెవల్ కాలువలు దీనావస్థలో ఉన్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పనులు చేపట్టిన గుత్తేదారులకు బిల్లులు చెల్లించపోవడమే సమస్యకు కారణమైందని అంటున్నారు. దిలావర్‌పూర్ వద్ద ఎత్తిపోథల విధానంతో ఎస్సారెస్పీ నుంచి ఈ కాలువలకు నీరందించాలని భావించారు. దీనికి అనుగుణంగానే ఇక్కడ భారీ పంప్‌హౌజ్‌ను సైతం నిర్మించారు. ఇప్పటి వరకు రూ.444.42 కోట్లను ఖర్చు చేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. గత రెండున్నర సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 298.51 కోట్లను మంజూరు చేసింది. 2024 డిసెంబర్ వరకు పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఆ నిధుల మంజూరు కాగితాలకే పరిమితం కావడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు.



డిస్ట్రిబ్యూషన్ కాలువ పంప్‌హౌజ్

సర్కారు స్పందిస్తేనే పనులు

సాగునీరు అందేది ఎప్పుడు

● గౌతం, రైతు, చించాల

28వ ప్యాకేజీ ద్వారా సాగునీరు అందితే నా ఐదు ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. కానీ యేండ్లు గడుస్తున్న ఆ పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ఈ ప్రభుత్వమైనా త్వరగా పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని కోరుతున్నా.

ఇదిలా ఉండగా ప్రస్తుత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రకటించడంతో మళ్లీ ఈ కాలువల నిర్మాణాలపై ఆశలు రేకేత్తాయి. కానీ జిల్లాలోని సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులకు మాత్రమే తన ప్రాధాన్యత క్రమంలో చోటు కల్పించిన ప్రభుత్వం హైలెవల్ కాలువలకు ఎలాంటి నిధులు గానీ, ప్రాధాన్యతను గానీ ఇవ్వకపోవడంతో అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. ప్రస్తుతం 27వ నంబర్ ప్యాకేజీ కాలువతో పాటు ముథోల్ నియోజకవర్గ పరిధిలోని 28వ నంబర్ ప్యాకేజీ పనులు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. నిర్మించిన కాలువలు గానీ, ఇతర పనులన్నీ సరియైన నిర్వహణ లేక వర్షాల ధాటికి కొట్టుకుపోయాయి. 27వ నంబర్ ప్యాకేజీ హైలెవల్ కాలువల నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు దాదాపు రూ.400 కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేస్తేనే పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని లేనట్లయితే యధాతథా పరిస్థితి కొనసాగుతుందని అంటున్నారు.

28వ నంబర్ ప్యాకేజీ కాలువ పనులు దయనీయం

ముథోల్ నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన 28వ నంబర్ హైలేవల్ కాలువ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఈ కాలువ కోసం రూ.486.67 కోట్లను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటి వరకు కేవలం రూ. 235 కోట్లను మాత్రమే అందులో నుంచి వ్యయం చేశారు. 50శాతానికి లోపుగానే పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల ఇప్పటి వరకు కూడా భూసేకరణ పూర్తికానట్లు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమంటున్నారు. అయితే ముథోల్ నియోజకవర్గానికి చెందిన అప్పటి ప్రజా ప్రతినిధులు ఈ కాలువ నిర్మాణ పనులపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో నిధుల విడుదల విషయమై తీవ్ర జాప్యం జరిగిందని అంటున్నారు. ఇదిలా ఉండగా అప్పటి బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ హడావిడిగా గత సంవత్సరం ప్యాకేజీ 27వ పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు ఆ పథకం పని చేయడం గానీ జరగలేదు. ఒక్క ఎకరానికి కూడా నీరందించలేని పరిస్థితిలో ఉన్న కాలేశ్వరం కాలువలపై దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వరకు వ్యయం చేసి ఉంటారని చెబుతున్నారు.

ప్యాకేజీ నంబర్ 27 పనులను వెంటనే పూర్తి చేయాలి

● నర్వాడే గంగాధర్ పటేల్, మాడేగాం, దిలావర్‌పూర్



కాలేశ్వరం పథకం కింద చేపడుతున్న ప్యాకేజీ 27వ నంబర్ పనులను వెంటనే పూర్తి చేయాలి. ఇటీవల జరిగిన ఎన్నికల కంటే ముందుగా అప్పటి కేటీఆర్ ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు భూములకు ఒక్క చుక్క నీరు అందడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సాగుభూములకు నీరందేలా నిరంతర చర్యలు తీసుకోవాలి.

» నిధుల కొరతే అసలు కారణం » పట్టించుకోని పాలకులు » అటకెక్కిన లక్ష ఎకరాల సాగులక్ష్యం



ప్యాకేజీ నంబర్ 27 కింద చేపట్టిన నిర్మాణం

నిర్మల్ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తాం

● చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ సందర్భంగా అర్జుమన్ అలీ



నూతన చైర్మన్‌లను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ అర్జుమన్ అలీ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జుమన్ అలీ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో చైర్మన్ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో పాఠకులు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి అన్ని రకాల పోటీ పరీక్షల సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. గ్రూప్స్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యేలా సహకరిస్తానన్నారు. అన్ని భాషలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్జుమన్ అలీని నాయకులు శాలువా, పుష్ప గుచ్చాలతో సన్మానించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్, కరీంనగర్ చైర్మన్ సత్తు మల్లేష్, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, కౌన్సిలర్లు ఇమ్రానుల్లా, వాణి, తారక రఘువీర్, నాయకులు జునైద్, మతిన్, అజహార్, కీజర్, తదితరులున్నారు.

వడ్యాల్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

లక్ష్మణచాంద, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సన్నరకం వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి 2,320, బి గ్రేడ్ వరి ధాన్యానికి 2,300లు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపెల్లి భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ ఎంపీపీ కోండ్ర లక్ష్మీ నరేష్‌రెడ్డి, పార్‌పెల్లి మాజీ సర్పంచ్ అబ్బిడి ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, నాయకులు అయిండ్ల పోతరెడ్డి, గరిపెల్లి గంగాధర్ గౌడ్, కమల్‌కోట రాజారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కేంద్రం నిర్వాహకుడు నవీన్ రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

డీసీఎంఎస్ కేంద్రం నిర్వాహకుడు నవీన్‌రెడ్డిపై లక్ష్మణచాంద తహసీల్దార్ జానకి నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.కొనుగోలు కేంద్రం ప్రారంభానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ప్రోటోకాల్ పాటించకుండా అగౌరవపరిచారని ఆమె అందులో పేర్కొన్నారు.

కిచెన్ గార్డెన్ నిర్వహణ భేష్



లక్ష్మణచాంద, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రం కిచెన్‌గార్డెన్ నిర్వహణ భేష్ అని ఎంపీడీవో రాధా రాథోడ్ అభినందించారు. ప్రభుత్వ పథకాల పట్ల జనాన్ని చైతన్యపరచటంలో భాగంగా కళాజాత కార్యక్రమం నిర్వహణలో ఆమె నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె కిచెన్ గార్డెన్ నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని ప్రశంసించారు. ఎంపీడీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది, కళాజాత బృందం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణుల మరణాలు తగ్గించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాతృత్వ మరణాలు తగ్గించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మాతృత్వ మరణాల నియంత్రణపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మాతృ మరణాలను నిరోధించడానికి కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలకు పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య స్థితిని నమోదు చేయాలన్నారు. హై రిస్క్ గర్భస్థ మహిళలను గుర్తించి, దానికి అనుగుణంగా చికిత్సలను తీసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. గర్భిణీలకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. హై రిస్క్ గర్భిణీలపై నిరంతర పర్యవేక్షణ ఉంచి, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటూ అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణీలను గుర్తించేందుకు గాను గ్రామీణ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందికి అవసరమైన శిక్షణలను ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, వైద్యాధికారులు సురేష్, సౌమ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

నిర్మల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నీటి పారుదల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్దేశించిన గడువులోగా కాళేశ్వరం 27 ప్యాకేజీ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ పథకంలో భాగంగా లక్ష్మీ నరసింహ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పనుల పురోగతి వివరాలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎటువంటి అసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమా వేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేష్‌కుమార్, ఏఈఈలు సిరాజుద్దీన్, గంగాధర్ , అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఓ సామాజిక సేవ

● పోలీసుల మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ఎస్పీ జానకి షర్మిల



రక్తదానం చేస్తున్న డీఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ఓ సామాజిక సేవా కార్యక్రమంగా భావించి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె నిర్మల్ డివిజన్ పోలీసులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రారంభించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, దేశం కోసం ప్రాణాలు అర్పించి భావితరానికి స్పూర్తిగా నిలిచారన్నారు. వారి త్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు శాంతియుత జీవనం గడుపుతున్నారన్నారు. పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తదానం చేసి ఆదర్శంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ 6 నెలలకోసారి రక్తదానం చేసి ప్రజల నుండి గౌరవం పొందాలన్నారు. డీఎస్పీ గంగారెడ్డిని, రక్తదానం చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, నవీన్ కుమార్, ఆర్ఎస్సైలు రాం నిరంజన్ రావు, శేఖర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీకి 5న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నిర్మల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులు ఒప్పంద పద్ధతిన భర్తీ చేయనున్నట్లు సూపరెండెంట్ బి. సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5న మధ్యాహ్నం 2లోగా పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ లో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. అనస్థీషియా పోస్టులు 2, గైనకాలజిస్ట్ 2, పీడియాట్రిషన్ 2, ఈఎన్‌టీ 1, రేడియాలజిస్ట్ 1, జనరల్ సర్జన్ 3, జనరల్ మెడిసిన్ 2, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 10 పోస్టుల ఖాళీలు భర్తీకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

చిరుతపులి సంచారం

సారంగాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రవీంద్రనగర్ తండా సమీపంలో గల అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు తండా వాసులు తెలిపారు. శుక్రవారం ఉదయం మేకల కాపరి మేకలను అటవీ ప్రాంతానికి పశుగ్రాసం కోసం తీసుకవెళ్లిన సమయంలో చిరుతపులి పశుగ్రాసం చేస్తున్నటువంటి మేకల వద్దకు వెళ్లి మేకలను తినడంతో మేకల కాపరి చెట్టు పైకి ఎక్కి కేకలు వేయడం వల్ల పంట పొలాల్లో ఉన్న రైతులు ఒక్కసారిగా సంఘటన స్థలానికి చేరుకొని కేకలు వేయడంతో చిరుతపులి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తండా వాసులు తెలిపారు. దీంతో అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరించడంతో భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. వెంటనే పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు

చెరువులో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కుభీర్, అక్టోబరు 25 : మండలంలోని సాప్లీ గ్రామ చెరువులో ప్రమాదవశాత్తు అవదూత్ రాజరత్న (22) అనే వ్యక్తి పడి మృతి చెందినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం మృతుడు అవదూత్ రాజరత్న తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామస్తుడు. గత నాలుగు రోజు క్రితం సాప్లీలోని తన పెద్ద ఇంటికి వచ్చాడు. అయితే గురువారం కట్టెలు తీసుకురావడానికి తన వరుసకు అన్నయ్య అయిన సందీప్‌తో కలిసి వెళ్లగా, అక్కడ చెరువులో స్నానం చేశారు. కాగా ప్రమాదవశాత్తు చెరువులోపలికి పడిపోవడంతో, సందీప్ చుట్టుపక్కన పొలం వాళ్లని పిలిచి చెరువులో వెతకగా ఆచూకి దొరకలేదు. కాగా శుక్రవారం ఉదయం గ్రామస్తులు చెరువులోకి చూడగా రాజరత్న చనిపోయి ఉన్నాడు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

ఒకరికి తీవ్ర గాయాలు

ఖానాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లపాడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లో వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ రాజీవ్‌నగర్‌కు చెందిన గడ్ల పెంటయ్య అనే మేస్త్రి కడెం వైపు పని నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మండలంలోని తర్లపాడ్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఖానాపూర్ నుండి బీర్నంది వెళ్తున్న ఏపీ 01 ఎక్స్ 7225 అనే ఆటో అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో పెంటయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

తొలిరోజే.. గందరగోళం

(5వ పేజీ తరువాయి)

పంట చేతికి రావడంతో క్రమంగా పత్తి ధరలు పడిపోతున్నాయి. ప్రస్తుతం రూ.7200 వరకు పత్తికి ధర చెల్లించే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. సీసీఐ విధిస్తున్న నిబంధనలతో రైతులు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. నాణ్యత, తేమ శాతం పేరిట భారీ కోతలు విధిస్తూ గిట్టుబాటు ధర అందడం లేదని రైతులు చెబుతున్నారు. జిల్లాలో నల్ల రేగడి భూముల్లోనే పత్తి పంట అధికంగా సాగవుతోంది. దీంతో తేమ శాతం కూడా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. పంట చేతికి వచ్చిన తర్వాత రెండు మూడు రోజులు ఆరబెట్టిన మార్పు కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో చేతికి వస్తున్న పత్తి పంటలో 20 నుంచి 30వరకు తేమ శాతం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కనీసం 16శాతం నుంచి 20 శాతం వరకైనా సడలింపు ఇస్తేనే మద్దతు ధర దక్కే అవకాశం ఉందంటున్నారు.

గంటల తరబడి చర్చలు

జిల్లా కలెక్టర్ రాజర్షిషా రైతులు, వ్యాపారులతో గంటల తరబడి చర్చలు జరిపినా.. ఫలితం లేకుండానే పోయింది. తేమ శాతం అధికంగా ఉండడంతో సీసీఐ పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరించింది. దీంతో పత్తి కొనుగోళ్లలో తొలిరోజే గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పత్తిలో తేమ 8నుంచి 12శాతం లోపు ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ స్పష్టం చేసింది. దీంతో ప్రైవేట్ వ్యాపారులే దిక్కనట్లుగా మారింది. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా క్వింటాల్ పత్తికి రూ.7150 చెల్లించేందుకు వ్యాపారులు అంగీకరించారు. అయినా రైతులు నిరాకరించడంతో పరిస్థితి మొదటికే వచ్చింది. పత్తిని విక్రయించేందుకు వివిధ మండలాల నుంచి రైతులు ఉదయమే మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. అయిన సాయంత్రం 5గంటల వరకు పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఉదయం నుంచి రైతులు మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాశారు. అధికారులు కనీస వసతులను కల్పించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పగలంతా ఆకలితో అలమటించారు. అందుబాటులో ఉన్న హోటళ్లలో దాహం, ఆకలిని తీర్చుకున్నారు. ఓపిక నశించడంతో సాయంత్రం జిల్లాకేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో రైతులు రాస్తారోకోకు దిగారు.

కలెక్టర్ కాళ్లు మొక్కిన రైతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

పత్తి పంటకు మద్ధతు ధర కల్పించి, తేమ శాతం నిబంధనను సడలించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. కాగా ఉదయం నుంచి రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా రైతులకు మంచి ధర కల్పించాలనే ఉద్దేశంతో సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులతో చర్చలు కొనసాగించారు. ఈ క్రమంలో బయటకు వచ్చిన కలెక్టర్‌ను రైతులు మాట్లాడే క్రమంలో ఓ రైతు కలెక్టర్ కాళ్లను మొక్కారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించి మా రైతులను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోళ్లకు లైన్ క్లియర్

- సద్దుమణిగిన పత్తి రైతుల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లకు లైన్ క్లియర్ అయింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు ఆందోళనకు దిగడంతో పత్తి వ్యాపారులు దిగివచ్చారు. అధిక తేమతో కూడిన పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ నిరాకరించడంతో రైతులు రోడ్డెక్కి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఉదయం నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రైవేట్ వ్యాపారులు, రైతులతో చర్చలు జరిపారు. చివరకు తేమతో సంబంధం లేకుండా రూ.6700కు పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ వ్యాపారులు అంగీకరించారు. దీంతో గత్యంతరం లేక రైతులు కూడా ఒప్పుకోవడతో పత్తి రైతుల ఆందోళన వద్దు మణిగింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు చేరుకున్న పత్తి బండ్లకు టోకెన్లు జారీ చేసి శనివారం నుంచి తిరిగి పత్తి కొనుగోలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంది

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్





నిప్పంటుకొని చికిత్స పొందుతున్న నాయకులు

ఉట్నూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో వచ్చిన పదేళ్లలో ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కుటుంబం తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుందని, అప్పుల కుప్పలుగా చేర్చి కొత్త ప్రభుత్వానికి అప్పగించిందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ ఆరోపించారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ రైతు పోరుబాట కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రిని ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకుని ఆరోపణలు చేశారన్నారు.

బజార్‌హత్నూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేసే కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కేపాండురంగ్ చేతిపై పెట్రోల్‌పడి గాయలయ్యాయి. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసే కార్యక్రమంలో పోలీసులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు తోపులాట జరగడంతో నిప్పు అంటించిన పెట్రోల్ బాటిల్ జల్కేపాండురంగ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులపై పడడంతో వారికి గాయాలైనట్లు తెలిపారు. ప్రథమచికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ తరలించారు. గాయాలైన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, నాయకులు పాషపు వెంకటరమణ ఉన్నారు.

జైనథ్, గుడిహత్నూర్, తలమడుగు, బోథ్ బోథ్ మండలాల్లో రైతు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కి లేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసార వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్ దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. మావలలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ప్రతిఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలి

ఉట్నూర్, అక్టోబరు 25 : భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు క్యాంపు నిర్వహణ కార్యక్రమాన్ని ఉట్నూర్ పట్టణంలోని వినాయకచౌక్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బీజేపీ దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంపై నమ్మకంతో, భారతదేశ బంగారు భవితకు భరోసా బీజేపీ మాత్రమే అనే విశ్వాసంతో, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని బీజేపీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. మాతో మమేకమై, మా కుటుంబమై, మాకు మరింత బలాన్ని సమకూర్చిన దేశ ప్రజలకు, మా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. రాబోయే రోజుల్లో అందరం కలిసి వికసిత్ భారత్‌ను నిర్మిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా పదాధికారులు రాథోడ్‌శేషారావు, హరిప్రసాద్, ఆడేదన్‌లాల్, శ్రీరామ్‌నాయక్, కొండేరిరమేష్, తొగిటి నాగ భూషణ్, విఠల్, సాడిగే రాజేశ్వర్, తన్నీరు సతీష్, బింగి వెంకటేశ్, ఉస్కెమల్ల దేవిదాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

ఇంద్రవెల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండలం వడ్‌గావ్ పంచాయితీ కేంద్రంలో పెందూర్ లక్ష్మణ్ ఇంటిలో భోగి పండుగ పూజల కోసం దేవుడి వద్ద దీపం ఏర్పాటు చేశారు. దేవుడి దగ్గర ఎప్పటి లాగే దీపం వెలిగించి బయట పనులు చేస్తుండగా దీపం పత్తిని ఎలుకలు తీసుకువెళ్లి బట్టలలలో పెట్టడంతో ఇళ్ళు దగ్ధం అయిందని పంచాయితీ కారోబార్ మెస్రం సీతారాం తెలిపారు. ఇంటిలో దీపావళి పండుగ కోసం తీసుక వచ్చిన కొత్త బట్టలతో పాటు ఫర్నీచర్, ఇతర సామాగ్రి కాలిపోవడంతో రూ.40 వేల వరకు నష్టం జరిగిందని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఇల్లు దగ్ధం అయిన విషయం మండల తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో మండల ఎంఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, వడ్‌గాం గ్రామానికి వెళ్లి దీపంతో దగ్ధమైన ఇంటిని పరిశీలించారు.

రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నో ప్రలోభాలకు గురి చేసినప్పటికీ రైతులు, ప్రజలు అవేమి లెక్క చేయకుండా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి హాజరయ్యారని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు.

పత్తి రైతులను మోసం చేస్తున్న బీజేపీ నాయకులను తిరగనివ్వద్దు: కాంగ్రెస్

బోథ్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులను పత్తి నిలువునా ముంచుతున్న బీజేపీ నాయకులను రైతులు గ్రామాల్లో తిరగనివ్వద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బోథ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పండించిన పత్తికి 7 వేల 5 వందల ఇరవై ఒక్క రూపాయి ధర నిర్ణయించి సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్నారని అదే గుజరాత్ రాష్ట్రంలో 8800 రూపాయలు మద్దతుగా ధర ప్రకటించి కొనుగోలు చేయడంతో అంతర్యం ఏమిటని ఆయన విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో నాణ్యమైన పత్తి లభిస్తుందని ఇక్కడి పత్తిని కాదని గుజరాత్ పత్తికి ఎక్కువ ధర చెల్లించడంలో కారణమేందో జిల్లాకు చెందిన ఎంపీతో పాటు ముగ్గురు బీజేపీ, ఎమ్మెల్యేలు రైతులకు సమాధానం చెప్పాలన్నారు. గుజరాత్‌లో ప్రకటించిన ధరతోనే ఆదిలాబాద్ జిల్లా రైతులు పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో జిల్లా రైతులు బీజేపీ నాయకులను తిరగనివ్వవద్దని పేర్కొన్నారు. అంతేగాక ధర కల్పించడంలో విఫలమైతే ఎంపీ ఎమ్మెల్యేలు పదవులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డితో పాటు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం

గుడిహత్నూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబర్ 3న హైదరాబాద్‌లోయ నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ పేదల రాజ్యాన్ని నిర్మించడానికి పార్టీ నిర్మాణంపై సమీక్ష భవిష్యత్తు కార్యచరణ కోసం నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వేణు, దావీద్ పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు సన్మానం

భీంపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం విద్యుత్ శాఖలో పనిచేసి బదిలీపై వెళుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్, సబ్ ఇంజనీర్ సాయి, లైన్ ఇన్‌స్పెక్టర్ వసంత్‌లను శుక్రవారం నిపాని సబ్ స్టేషన్‌లో సిబ్బంది శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా వచ్చిన అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షౌకత్‌లను స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, సత్యం ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్‌ది కుటుంబ పాలన కాదు.. ప్రజాపాలన

- పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ మాదిరిగా మాది కుటుంబ పాలన కాదు కాంగ్రెస్‌ది ప్రజా పాలన అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్‌కు మంజూరైన టెక్స్‌టైల్ పార్కును వరంగల్‌కు తరలించింది కేటీఆర్ కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో సీసీఐ పరిశ్రమను ఎందుకు పునరుద్దరించ లేదో జిల్లా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. దీంతో 55వేల మంది రైతులకు రూ.600ల కోట్లను కేటాయించి రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. గతంలో ముంపుకు గురైన పంటలకు నయా పైసా పరిహారం ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముంపుకు గురైన పంటలకు రూ.3 కోట్లకు పైగా పరిహారాన్ని చెల్లించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అంటేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రభుత్వమని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎంత మొరిగినా ఏమి కాదని కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆశీస్సులు, ఆశీర్వాదం ఉందన్నారు. పదేళ్లలో ఒక్క ఇళ్లు కూడా కట్టలేదని గతంలో ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదన్నారు. ఓటమి పాలైన కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదన్నారు. జోగురామన్నను తడిగుడ్డతో గొంతు కోసింది కేటీఆర్ కాదా అని ప్రశ్నించారు. మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించడం జరిగిందన్నారు. కేటీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వకుంటే జోగు రామన్న అడవిలోకి పారిపోయిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. కేటీఆర్ పూర్తిగా అబద్దాలు చెప్పడానికే ఆదిలాబాద్ వచ్చాడని ఆరోపించారు. దళితున్ని సీఎం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. సోనియాగాంధీ పెద్ద మనస్సుతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌దేనన్నారు. కాళేశ్వరం ఉసురు తలగడంతోనే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని మహారాష్ట్రలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. బీజేపీ సీసీఐ పునరుద్ధరణను రాజకీయంగా వాడుకుంటుందని ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గాడిదగుడ్డే మిగిలిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా హామీలను నేరవేరుస్తుందన్నారు. అనంతరం కేటీఆర్ దిస్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటీఆర్ ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి,అల్లూరి అశోక్‌రెడ్డి దిగంబర్‌రావు పాటిల్, దేరాకృష్ణారెడ్డి, గిమ్మసంతోష్, గుడిపెల్లి నగేష్, శ్రీలేఖ, రంగినేని శాంతన్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, చరణ్‌గౌడ్, సామరూపేష్‌రెడ్డి, షకీల్ తదితరులున్నారు.

భైంసా రూరల్ పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌస్

- ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పీ అవినాష్



విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఏఎస్పీ

భైంసా రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారి త్యాగాలను స్మరిస్తూ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ అవినాష్ కుమార్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడారు. అమరవీరుల త్యాగాలు స్ఫూర్తి దాయకమని కొనియాడారు. విద్యార్థులు పోలీసు చట్టాలు, కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాలు, బాంబు స్క్వాడ్, ఫింగర్ ప్రింట్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు, విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది. పోలీసు అధికారుల విధులు ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యార్థుల రక్షణ కోసం ఏర్పాటైన షీ టీం భరోసా సెంటర్, సైబర్ నేరాలు, పోలీసుశాఖలో ఉపయోగిస్తున్న ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, పోలీస్‌స్టేషన్ పనితీరు, డయల్ 100 గురించి వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సీఐ నైలు. ఎస్సై శ్రీనివాస్, ఏఎస్సై మారుతి, పోలీసు బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సిలబస్ డిసెంబర్ లోగా పూర్తి చేయాలి

భైంసా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్దమైన విధానాల ద్వారా ఆధ్యాపకులందరూ పాఠ్యాంశాల బోధన చేపట్టి డిసెంబర్‌లోగా ఇంటర్ సెలబస్ పూర్తి చేయాలని డీఐఈవో జాదవ్ పరుశురామ్ నాయక్ సూచించారు. శుక్రవారం భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సెలబస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా విషయాలకు సంబంధించి ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కళాశాల నిర్వాహణ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచెలా చర్యలు తీసుకోవాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్దం చేయాలన్నారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ శివరంజని, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవాలి

ముథోల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. ముథోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో రమణారెడ్డితో కలిసి ఆదర్శ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కలర్‌ఫుల్ పెయింటింగ్స్, ప్రత్యేక గ్రంథాలయ గది, విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలంగా టేబుళ్లు, కార్పెట్, పుస్తకాలు అమర్చుకోవడానికి ర్యాక్స్, విద్యార్థులు గీసిన చిత్రాలు, రాసిన కథలు ప్రదర్శించడానికి పిన్ బోర్డ్స్ తదితర సౌకర్యాలు సమకూర్చడం అభినందనీయమని ఎంపీడీవో అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ మాట్లాడుతూ... రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 19 మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారన్నారు.

ఖానాపూర్‌లో ఘనంగా భీమన్న జాతర

- ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆలయంలో జాన్సన్ నాయక్ సహా పలువురు ప్రముఖుల ప్రత్యేక పూజలు



భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్, తదితర నాయకులు



ఆలయ ప్రాంగణంలో చిన్నారికి పుట్టు వెంట్రుకలు తీసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఖానాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భీమన్న స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతర కార్యక్రమానికి ఖానాపూర్, కడెం, పెంబి మండలాల భారీగా భక్తులు తరలి వచ్చారు. భీమన్న జాతరను పురస్కరించుకుని ఆలయంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్‌నాయక్ సహా పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు భీమన్న గజాలను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పలువురు చిన్నారులకు పుట్టు వెంట్రుకలు సమర్పించడంతో పాటు నిలువెత్తు బంగారం (బెల్లం) తూకం చేస్తూ భీమన్న స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకొని ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద చిన్నారుల సందడి కనిపించింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా ఆలయ కమిటీ, భీమన్న భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ పరిశీలనకు వెళ్లిన

రైతులను అడ్డుకున్న పోలీసులు



మరికల్‌లో గుండంపల్లి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



మరికల్ పోలీసుల తీరుకు నిరసనగా ధర్నా చేస్తున్న గుండంపల్లి రైతులు

దిలావర్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిలావర్‌పూర్ - గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల ప్రజలు గత కొంతకాలంగా ఉద్యమిస్తున్నారు. అయితే ఎందుకైనా మంచిదని ఒకసారి ఇప్పటికే పని చేస్తున్న ఇథనాల్ పరిశ్రమలను సందర్శించి వాటి వల్ల లాభ, నష్టాలను తెలుసు కోవడంతో పాటు అక్కడి పరిస్థితులను పరిశీలించడంతో పాటు ప్రజలను కలిసి అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం రాత్రి రెండు బస్సుల్లో వంద మంది రైతులు ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభమైన నారాయణపేట జిల్లాలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని పరిశీలించేందుకు వెళ్లారు. రైతులు వెళ్తున్న బస్సులను నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చేరుకోగానే మరికల్ పోలీసులు రైతులను అడ్డుకున్నారు. రైతులు చిత్తనూరు వెళ్లేందుకు అనుమతి లేదని తిరిగి వెళ్లిపోవాలని బెదిరించినట్లు గుండంపల్లి రైతులు తెలిపారు.

రోడ్డుపై బైఠాయించిన గుండంపల్లి రైతులు...

చిత్తనూరు వెళ్లిన రైతులను మరికల్ పోలీసులు అడ్డగించి బెదిరింపులకు పాల్పడటం పట్ల గుండంపల్లి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా అక్కడే రోడ్డుపై బైఠాయించారు. చిత్తనూరు వెళ్లేందుకు మమ్మల్ని అనుమతించలేరంటే ఖచ్చితంగా ఇథనాల్ పరిశ్రమతో నష్టమే అధికమని చెప్పకనే చెప్పినట్లయిందన్నారు. ఈ సంఘటనతో మేము ఇథనాల్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేయడం న్యాయమైందని తేలిందన్నారు. ఎట్టి పరిస్థితులనైనా ఎదుర్కొంటామని, ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుని తీరుతా మన్నారు. చిత్తనూరు సంఘటన మాలో మరింత కసిని పెంచిందన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

దిలావర్‌పూర్, అక్టోబరు 25 : గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అరుణ రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని బన్సపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, సెగ్రిగేషన్ షెడ్‌ను, నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవళికను ప్రశంసించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో గోవర్ధన, ఈజీఎస్ ఏపీఏ రాజు, కారోబార్ మల్లేష్, తదితరులున్నారు.


ఘనంగా కొమురంభీం విగ్రహోష్కరణ



కుభీర్ కొమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కుభీర్, అక్టోబరు 25 : మండల కేంద్రం కుభీర్‌లోని బస్టాండ్ వద్ద ఆదివాసీ నాయక్‌పోడ్ నాయకులు నూతనంగా ఏర్పాటు చేసిన కొమురంభీమ్ విగ్రహాన్ని శుక్రవారం ఆదివాసీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ముందుగా విఠలేశ్వర ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసం నాయక్‌పోడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సట్ల అశోక్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు జనగ భీముడు, ముచ్చిండ్ల భోజన్న, గాండ్ల రాంచందర్ మాట్లాడారు. జల్ జంగల్ జమీన్ కోసం ఆదివాసి హక్కుల సాధన కోసం పోరాడి అసువులు బాసిన పోరాట వీరు ఆదివాసీ ఆరాధ్య దైవం కొమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిడి విఠల్, ఏశాల దత్త్రాత్రి, నాగేష్, సంఘం సభాధ్యక్షులు ముచ్చిండ్ల విఠల్, ముత్యం, మహేందర్, సాయినాథ్ తదితరులున్నారు.

రొమ్ము క్యాన్సర్ పై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్త్రీ వైద్య నిపుణురాలు డా. స్నేహరెడ్డి

భైంసా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు రొమ్ము క్యాన్సర్ పై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డా. స్నేహరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలలో భాగంగా నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ లక్షణాలను వివరించారు. 35 సంవత్సరాలు పై బడిన మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశముందని తెలిపారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు మహిళలు ఆరోగ్య జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. నిత్యం వ్యాయమం, యోగా సాధన చేస్తూ సరియైన రీతిలో పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతపై అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఇందులో గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల డైరెక్టర్ ముష్కం ప్రసన్న రాణి, ప్రతినిధి తన్వశ్రీ , కళాశాల ఆధ్యాపకులు, విద్యార్థులు, ఆయా ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ

ముథోల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనుల గుర్తింపు, లేబర్ బడ్జెట్ ఆమోదం గురించి శుక్రవారం ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో శివ కుమార్, ఈవో ప్రసాద్‌గౌడ్, టీఏ యోగేశ్వర్ పాల్గొన్నారు.



ఇచ్చోడ మండలంలోని రఘుగూడ, మాన్కూగూడ గ్రామాల్లో గుస్సాడీలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

మారుతిగూడలో గుస్సాడి భోగి పూజలు

- కనుబొమ్మల వెంట్రుకలు తీసే ఆచారం
- ఆదివాసీ గిరిజన గూడెల్లో కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు

ఇంద్రవెల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గూడెల్లో గుస్సాడి దండారి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని మారుతిగూడ గ్రామంలో ఏత్మాసూర్ పేన్ దేవతలు ఉన్న ఇంటి ఆవరణలో ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం దండారీ ఉత్సవాల్లో గుస్సాడీలు ధరించే నెమలి ఈకలతో తయారు చేసిన టోపీలు, ఖోడాంగ్, ఏత్మాసూర్ పేన్ దేవతలు, డోల్, పిప్రే, సన్నాయి, తుడుం, డప్పులు, పాయిలి, తబాల, వివిధ వస్తువులను ఉంచి వాటికి సంప్రదాయం ప్రకారం పురుషులు, మహిళలు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. దేవతలకు నైవేద్యా లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భోగి పూజల అనంతరం గుస్సాడీ లుగా మారే యువకులు ఒకే పల్లెంలోయ భోజనాలు చేశారు.



కనుబొమ్మల వెంట్రుకలను తీసే ఆచారం

- కనుబొమ్మల వెంట్రుకలు తీసే ఆచారం

ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయ ఆచారం ప్రకారం కనుబొమ్మలను సుమారు 100 మంది భోగి రోజున మొక్కులు ఉన్నవారు కనుబొమ్మలను, తల వెంట్రుకలను సమర్పించారు. ఈ ఆచారం అన్నింటికన్నా భిన్నంగా ఉంటుంది. కనుబొమ్మలను సమర్పించే సమయంలో అవి కింద పడకుండా జాగ్రత్తగా ఇంటి ఆడపడుచులు ఓ తెల్లని వస్త్రంతో సేకరించి ఎత్మాసూర్ దేవతకు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ దుర్వ గోవిందరావు, దుర్వ జంగు, దుర్వ జుగదిరావు, దేవరి దుర్వ యోగాజీ, మహాజన్, మెస్రం నాగోరావు పాల్గొన్నారు.

ఆదివాసీ గూడేల్లో దండారీ సంబురం

ఇచ్చోడ: ఇచ్చోడ మండలంలోని ముక్రా(బి) గ్రామపంచాయితీ పరిధిలోని రఘుగూడ, మాన్కూగూడ గ్రామాలలో శుక్రవారం గుస్సాడీ దండారి సంబురాలు ప్రారంభమయ్యాయి. దండారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన గిరిజనులు గుస్సాడీ వేషధారణ చేశారు. గుస్సాడీలను అందంగా అలంకరించి ఆదివాసీల సంప్రదాయ ప్రత్యేక నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రతి ఏటా భక్తి శ్రద్ధలతో దండారీ వేడుకలను నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్‌లు ఆడ భీంరావ్, జంగు, దేవరి భీంరావ్, భూజంగ్‌రావ్, పూజారి గంగారాం, గ్రామ మాజీ సర్పంచ్ ఆడవ్ మారుతి పాల్గొన్నారు.



గ్రామాల్లో గుస్సాడీలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు



గుస్సాడీలుగా మారే యువకులు ఒకే పల్లెంలో భోజనాలు చేస్తున్న దృశ్యం



తలమడుగు మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న గుట్టపైకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్న రోడ్డు ఇలా..

బీటీ రోడ్డు నిర్మాణం..
హామీలకే పరిమితం!

- ఎడ్ల బండి కూడా వెళ్లలేని స్థితిలో రోడ్డు
- ప్రతీ ఏడాది శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకుంటున్న రైతులు
- గుట్టపై మూడు వేల ఎకరాల సాగు భూమి.. రైతుల ఆందోళన



ఇబ్బందులు పడుతూ ఎడ్లబండితో గుట్టపైకి వెళ్తున్న రైతులు

రోడ్డు లేక ఇబ్బందులు

- మేకల సద్దాం యాదవ్, రైతు, తలమడుగు



గుట్టపైన వ్యవసాయం సాగు చేసే భూమి ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మించాలని గత 50 ఏళ్ల నుంచి ప్రభుత్వాలకు విన్నవి స్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎడ్లబండ్లు బోల్తా పడి తీవ్ర గాయాలపాలవుతున్నాం.

తలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం, రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో అవి సక్రమంగా అమలు కావడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న తలమడుగు గుట్ట రోడ్డు నిర్మాణం కోసం రైతులు దశాబ్దాల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా రోడ్డు నిర్మాణం కోసం హామీలు ఇస్తున్నారు. తప్ప అమలుపరచడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు గుట్టకు తలమడుగు గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపైన ఏడు గ్రామాలకు సంబంధించిన శివారు ప్రాంతంలో దాదాపు మూడు ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉన్నప్పటికీ రైతులకు సరైన రోడ్డు మార్గం లేక దశాబ్దాల నుంచి రాళ్లను రప్పలను దాటుతూ వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తలమడుగు గుట్టపై ఝరి, చర్లపల్లి, బరంపూర్, సకినాపూర్, డోర్లి, నడిమ్ పల్లె, తలమడుగు తదితర గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు వాటిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే విధంగా గుట్టపక్కన ఆదివాసీ గిరిజన గ్రామమైన చర్లపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎక్కువమంది ఉన్నారు. తలమడుగు నుంచి గుట్టపై నుంచి చర్లపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే ఆయా గిరిజన గ్రామాలతోపాటు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గుట్టపైన వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం లేక కొంతమంది రైతులు కౌలుకు ఇచ్చేస్తున్నారు. మరికొంత మంది రైతులు అలాగే వదిలి పెడుతున్నారు. గత ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మాణం చేపడతామని కొంతమంది ప్రజాప్రతినిధులు హామీనిచ్చారు తప్ప ఇప్పటివరకు రోడ్డు నిర్మాణంపై పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరుకాలం పండించిన పంటను ఇంటికి తెచ్చేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం రైతులంతా కలిసి శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయన్నారు. గతంలో ఎడ్ల బండ్లు బోల్తా పడి రైతులకు, పశువులకు గాయాలు అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి తలమడుగు గుట్టకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, చర్లపల్లి, తలమడుగు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.



మామిడిచెట్టుపై మొలకెత్తిన మర్రి, రావి చెట్టు

చెట్టుపై చెట్టు
అబ్బురపరిచేచెట్టు..!

ఇచ్చోడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సహజంగా మర్రి, రావి చెట్టు మొదట్లో మరో చెట్టుపై పెరగడం చూస్తుంటాం. మొలకెత్తినప్పుడు మరో చెట్టుపై మొలకెత్తి క్రమంగా ఆ చెట్టును నశింపజేసి ఇవి పారే వృక్షాలుగా ఎదగడం వీటి లక్షణం. కానీ చిత్రంలో కనిపిస్తున్న మామిడి చెట్టు మధ్యలో నుంచి ఒకవైపు మర్రి, మరోవైపు రావి చెట్టు మొలకెత్తాయి. వీటిలో ఏవి చివరివరకు నిలబడుతుందో వేచిచూడాలి. సహజంగా ఇలాంటి వృక్షాలు రెండు ఒకదానిపై మొలకెత్తవు. మామిడి చెట్టుపై మర్రిచెట్టు, రావిచెట్టు పెరుగుతుండడాన్ని చూసి కాలనీ ప్రజలు, అటువైపు వెళ్లే ప్రజలు ఆసక్తికరంగా చూస్తున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆశోక్‌నగర్ కాలనీలో మామిడి చెట్టుపై మొలకెత్తిన చిత్రమే ఇది.



మామిడిచెట్టు మధ్యలో నుంచి మొలకెత్తిన మర్రిచెట్టు



మామిడిచెట్టు మధ్యలో మరోవైపు మొలకెత్తిన రాగిచెట్టు

ధాన్యానికి రూ.500 బోనస్ ఎలా ఇస్తారంటే..

బోనస్.. బోనస్.. వరి రైతు నోట ఈసారి ఇదే మాట. సన్నాలకే వర్తింపజేస్తామని అధికారులు చెబుతు న్నా.. అవి ఏమిటనేది రైతుల్లో సందేహం ఉంది.. ఏ రకం ధాన్యానికి ఇస్తారు.. ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం..



భైంసా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) బోనస్.. జిల్లాలో వర్షాకాలం వరి ధాన్యం సేకరణకు పౌర సరఫరాల, సహకార, ఐకేపీ, మార్కెట్ కమిటీ అధికారులు సమాయాత్తమవుతున్నారు. కొనుగో లు కేంద్రాలు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈసారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న రకపు క్వింటా ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది.


అంచనాకు మించి సాగు

జిల్లాలో ఈ వర్షాకాలంలో వరి సాధారణ అంచనాకు మించి సాగైంది. సాధారణ సాగు అంచనా 1.25 లక్షల ఎకరాలు కాగా ఈసారి 1.38 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 13వేల ఎకరాల్లో అదనంగా సాగైంది మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో విస్తీర్ణం తగ్గవచ్చని భావించారు. ముగింపులో మంచి వర్షాలు పడటంతో వ్యవసాయ బోర్లు రీచార్జి కావడం, కుంటలు, చెరువులు నిండటంతో పుష్కలంగా సాగైంది. బోనస్ వస్తుందనే నమ్మకంతో సాగు పెంచారని భావిస్తున్నారు. జిల్లాలో గత సంవత్సరం వర్షకాలంలో సన్నరకం వరి సాగు 54 వేల ఎకరాల్లో ఉండగా ప్రస్తుతం సంవత్సరం సన్న రకపు సాగు 18 వేల ఎకరాల్లో పెరిగి మొత్తం 72వేల ఎకరాలకు పెరిగింది.

వీటికే బోనస్..

బోనస్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు మాత్రమే రూ.500 బోనస్ వర్తింపచేశారు. ధాన్యం గింజ పొడువు, వెడల్పును ప్రమాణికంగా తీసుకొని బోనస్‌ను అందించనున్నారు. ధాన్యం నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో అనే విషయం తెలుసుకోవడానికి ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఈసారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు. ఇలా ఉన్న సన్న రకానికి ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తింప చేసేలా చర్యలు చేపట్టారు.





28న బీసీ కమిషన్ సభకు తరలి రావాలి

ఉట్నూర్, అక్టోబరు25: జిల్లాలోని బీసీ కులాల సభ్యులు ఈనెల 28న జిల్లాకేంద్రానికి వస్తున్న బీసీ కమిషన్ సమావేశానికి తరలిరావాలని బీసీ కులాల ఉట్నూర్ డివిజన్ ప్రతినిధులు ఘర్షకుర్తి వెంకటేశ్, కాల్వ రవి, మరపాక రాజన్న, సీపతి రాజగౌడ్‌లు కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కులాల జనాభా ఘణన కోసం కసరత్తు ప్రారంభించిందని, బీసీల సమస్యల పరిష్కారం కోసం కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు సభ్యులు హాజరు అవుతున్నారని తెలిపారు. కుల సంఘాల నాయకులు ప్రతీఒక్కరు తరలిరావాలని కోరారు.



ఇంద్రవెల్లి మండలం మారుతిగూడ గ్రామంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

గూడెల్లో దండారీ సంబురం

● మారుతిగూడలో గుస్సాడి భోగి పూజలు

7 లో



శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్న రైతులు

హామీలకే పరిమితం!!

● సొంతంగా రోడ్డును బాగు చేసుకున్నరైతులు

7 లో



ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్‌ది ప్రజా పాలన

● జిల్లావ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనం

6 లో

► పత్తికి మద్దతుధర కోసం అన్నదాతల ఆరాటం ► తేమ నిబంధనలను సడలించాలంటూ రైతుల పట్టు ► ముహూర్తం ఖరారైనా.. ప్రారంభం కాని కొనుగోళ్లు ► సాయంత్రం వరకు రైతులతో జిల్లా కలెక్టర్ చర్చలు ► ఆగ్రహించిన రైతులు.. జాతీయ రహదారిపై ఆందోళన



● కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న ఓ రైతు



రాత్రి వేళ మార్కెట్ యార్డులోనే ఉన్న పత్తి రైతులు

చర్చలు సఫలం

● ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లకు లైన్ క్లియర్ ● తేమతో సంబంధం లేకుండా క్వింటాకు రూ.6700 ధర నిర్ణయం

(6వ పేజీలో..)

తొలిరోజే.. గందరగోళం

ఆదిలాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)/ ఆదిలాబాద్ రూరల్: జిల్లాలో అధికంగా సాగయ్యే పత్తి పంట కొనుగోళ్లకు తేమ నిబంధన ఆటంకంగా మారింది. శుక్రవారం పత్తి కొనుగోళ్లను చేపట్టేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. మద్దతు ధర రావడం లేదంటూ పత్తిని అమ్మేందుకు రైతులు నిరాకరించారు. జిల్లావ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలలో పత్తిని కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. కానీ రైతులు తేమ నిబంధనలను సడలించాలంటూ పట్టుబట్టారు. దీంతో గందరగోళ పరిస్థితులకు దారి తీసింది. గతంలోనూ తేమ నిబంధనల పై ఆగ్రహించిన రైతులు మార్కెట్ కార్యాలయంపై దాడికి దిగారు. దీంతో పలువురు రైతులపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ ఏడు జిల్లాలో 4లక్షల 33వేల ఎకరాలలో పత్తి పంట సాగైంది. దీంతో 30లక్షలకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి ఈసారి రూ.501 పెంచి మద్దతుధరను రూ.7521గా నిర్ణయించింది. అయితే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించే తేమ శాతం నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తేమ 8 శాతం ఉంటేనే పూర్తిస్థాయి మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. ఆ తర్వాత తేమ పెరిగితే ధరలో కోతలు విధిస్తున్నారు. శీతాకాలం ప్రారంభంలో 20 శాతం వరకు సడలింపు ఇవ్వాలని రైతులు కోరారు. అయిన వ్యాపారులు దిగిరాకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. సాయంత్రం వరకు జిల్లా కలెక్టర్, రైతులు, ప్రైవేట్ వ్యాపారులతో చర్చలు జరిపిన ఫలితం కనిపించ లేదు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

జిల్లావ్యాప్తంగా ఒకే ధరను చెల్లించి పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ పెట్టడంతో అయోమయ పరిస్థితులకు దారి తీసింది.

తేమ పేరిట కోతలు

అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడులతో అవస్థలు పడుతున్న అన్నదాతలను పత్తి ధర మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఈసారి రూ.7521 మద్దతు ధరను నిర్ణయించిన ఎవరికి దక్కే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే తేమ పేరిట భారీగా కోతలు పెట్టడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత పక్షం రోజులుగా జిల్లాలో పత్తి పంట చేతికి వచ్చిన కొనుగోళ్లు మాత్రం కొంత ఆలస్యంగానే ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు పంటను ఇంటి వద్దనే నిల్వ చేసుకుంటు ఎదురు చూస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ దళారులను ఆశ్రయించి పంటను అమ్మేసుకుంటున్నారు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. తేమ శాతం పేరిట ధరను అమాంతంగా తగ్గించడంతో నష్ట పోవాల్సి వస్తుందని చెబుతున్నారు. క్వింటాలు పత్తి ధర కనీసం రూ.10వేలు ఉంటేనే పెట్టిన పెట్టుబడులు చేతికి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏమూలన సరిపోదంటున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో రూ.6800 నుంచి రూ.7వేల వరకు ధర పలుకుతున్న ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కొందరికే దక్కే అవకాశం కనిపిస్తుంది. ప్రతీసారి ఇవే పరిస్థితులు కనిపిస్తున్న ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పంట చేతికి రాగానే పడిపోతున్న ధరలు

ప్రతీసారి పంట చేతికి రాగానే పత్తి ధరలు అమాంతంగా పడిపోవడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుంది. గత పక్షం రోజులుగా

మిగతా 6వ పేజీలో...



నుజ్జునుజ్జు అయిన వాహనం వెనుక భాగం

ఆదిలాబాద్ ఎమ్మెల్యేను ఢీకొట్టిన కారు

● స్వల్పగాయాలతో బయటపడిన ఎమ్మెల్యే
● కామారెడ్డి జిల్లాలో ఘటన

ఆదిలాబాద్ రూరల్/ సదాశివనగర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 25 : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు కారులో వస్తున్న ఎమ్మెల్యే వాహనాన్ని మార్గమధ్యలో కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజీవాడీ ఎక్స్ రోడ్డు వద్ద లారీ వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రాంతంలో బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో.. సర్వీస్ రోడ్డు పై వేసిన స్పీడ్ బ్రేకర్‌ల వద్ద ప్రమాదం జరిగింది. లారీ బలంగా ఢీకొట్టడంతో.. కారు వెనుక భాగం స్వల్పంగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. కాగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పాయలశంకర్.. వెంటనే అక్కడి నుంచి ఆదిలాబాద్‌కు బయలుదేరిన క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి : బోథ్ ఎమ్మెల్యే

తాంసి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టులో చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేపలు పట్టే సమయమని కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమయంలో చేప పిల్లలు వదలడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు.

టైగర్ జోన్‌తో ఇబ్బంది పెట్టొద్దు : ఎమ్మెల్యే బొజ్జుపటేల్



నివాళి అర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త



నూరు వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) కవ్వాల్ అభయారణ్యంను టైగర్‌జోన్ పేరుతో ప్రకటించడం వల్ల అభివృద్ధికి విఘాతం ఏర్పడుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోలాంగూడ గ్రామంలో నూరు వర్ధంతి సందర్భంగా జరిగిన కార్య క్రమానికి హాజరయ్యారు. ముందుగా కోలామ్ వీర రత్న కొమురంనూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాలలో అభివృద్ధి పథకాలు మంజూరు చేస్తున్నామంటే కాకుండా టైగర్‌జోన్ అడ్డు వస్తుందన్నారు. టైగర్‌జోన్‌లో పులిఉందో లేదో తెలియదు గాని గిరిజనుల అభివృద్ధికి మాత్రం విఘాతం ఏర్పడిందన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం నిజాం ప్రభుత్వంతో ఆ రోజు ల్లో కొమురంభీం కొమురం నూరు గిరిజనుల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా హాజరై కొమురం నూరు విగ్రహానికి పూలమాల వేసి ఘనం గా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో (పీవీటీజీ) మేస్రంమనోహర్, మహిళ కమిషన్ సభ్యురాలు కుముర ఈశ్వరిబాయి, మాజీ ఎంపీపీ పంద్రా జైవంతురావు, మాజీ సర్పంచ్ ఆత్రంరాహుల్, ఆదివాసీ సంఘ నాయకు లు,కోలం సేవా సంఘం నాయకులు టేకం భాస్కర్, మరసుకోలా తిరుపతి, టేకం భీమ్‌రావు, కమురరాజు, టేకం ఆనంద్‌రావు, మడావి రాజేశ్వర్, కొడిమెత తిరుపతి,టేకం వసంతరావు, సీఐ గండికోట మొగిలి, బొంత ఆశారెడి పాల్గొన్నారు.

నార్నూర్ : కొమురంనూరు కోలాంజాతి మహాపోరాటయోధుడు అని గాదిగూడ మండల మాజీ ఎంపీటీసీ కోడపతుక్కుబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కొమురంనూరు వర్ధంతిని ఘనంగా ఆదివాసీలు జరుపుకున్నారు.

పింఛన్ కోసం పాట్లు

సిరికొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బోరింగ్‌గూడ, చెమ్మన్‌గుడి, కన్నాపూర్, పోచంపల్లి, వాయిపేట్ తదితర ఆదివాసీ గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ప్రతీనెల పింఛన్ తీసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వీరిని బీపీఎం, ప్రతీ నెల ముప్పు తిప్పలు పెడు తున్నారని వారు వాపోయారు. శుక్రవారం బోరింగ్‌గూడ, చెమ్మన్‌గుడి, సాత్మోరీ, కన్నాపూర్ గ్రామాలకు చెందిన వృద్ధులు, మహిళలను పింఛన్ ఇస్తానని చెప్పి, తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా. తమకు పింఛన్ అందించలేదని వారు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఫించన్ ఇప్పించాలని వారు కోరుతున్నారు.



వేచిఉన్న పింఛన్‌దారులు

రాయిగూడలో భీం విగ్రహావిష్కరణ



రాయిగూడలో కొమురం భీం విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే

సిరికొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):గొప్ప ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీం అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం సిరి కొండ మండలంలోని రాయిగూడ గ్రామంలో కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఉద్యమ బాటలో, ఉజ్వల ప్రగతితో జల్, జంగల్, జమీన్ ' నినాదమే స్ఫూర్తితో కొమురం భీం ఆశయాల అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మహిళా కమిషన్ సభ్యురాలు కూస్రం నీలాబాయి, ప్రభుత్వ ఆశ్రమ పాఠ శాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒరగంటి పెంటన్న, మడావి కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

బజార్‌హత్నూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో డీఈవో ప్రణిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో నిర్వహించే పలు రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని వారికి సూచించారు. ఉదయం సమయంలో పాఠశాలకు చేరుకుని ప్రతి విద్యార్థికి ఆదర్శంగా ఉపాధ్యాయులు నిలవాలన్నారు. పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలు సుకున్నారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో ఏస్ఏ వన్ పరీక్షలు నిర్వహిస్తున్న అందున విద్యార్థులకు ప్రత్యేక ప్రిపరేషన్ తర్వాత రాను నిర్వ హించారని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు గా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచండి

● జిల్లా మాధ్యమిక అధికారి రవీంద్రకుమార్

నేరడిగొండ, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని జిల్లా మాధ్యమిక అధికారి రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆదిలాబాద్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీంద్రకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి క్లాస్ రూమ్‌ను తిరుగుతు అధ్యాపకుల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రాబోయే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని సూచించారు.

సైకిల్ ర్యాలీ



శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల విధి : ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన విధి అని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు వివిధ సందర్భాల్లో వినియోగించే ఆయుధాల పనితీరు, పోలీసుల విధులు, పోలీసు జాగిలాల పనితీరు, వాటి గురించి సిబ్బంది ఆన్‌లైన్‌లో పలు పాఠశాలల విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం జెండా ఊపి ప్రారంభించారు.

పశు గణన



పశుగణనను పకడ్బందీగా నిర్వహించండి

● జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్

తలమడుగు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామంలో 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.కిషన్ సహకార సంఘం బ్యాంకు చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ పశు గణన అనేది ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వ్యవసాయదారుల భవిష్యత్తును నిర్ణయించేది సర్వే అని తెలిపారు.

జిమ్‌లో సందడి



జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మడావి రజనీ జిమ్‌ను శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీసర్పంచ్ కోరెంగ సుంకట్‌రావు, పట్టణ అధ్యక్షులు ఎం.డి. జహీర్, నాయకులు పాల్గొన్నారు.